కథ

# నగేశం

డాక్టర్ యన్. రామచంద్ర

"సువాణక్కా నగేశన్న ఇంట్లో ఉన్నాడా" అంటూ జవాబుకు ఎదురు చూడకుండానే లోపలికి వచ్చింది నివాళి. ఇటీవలే పెండ్లి జరిగి భర్త ఇంకా మనుగుడుపుల పర్వంలోనే ఉన్నాడు. పి.జి. చదివి గ్రూపు-1 రాసి ఫలితాలకు ఎదురు చూస్తున్న రోజుల్లోనే నివాళితో పెళ్ళయింది పెద్ద కట్నంతో.

నివాళి రాకకు సువాణి ఆశ్చర్యపడటంతోపాటు తన భర్తను వెదుక్కుంటూ రావడంతో ఒకింత గర్వం కూడా పొందింది. తానుంటున్న వీధిలో తానొక్కటే ఉద్యోగి, పలు విమర్శలకు తావిచ్చిన వ్యక్తీనూ, మధ్య తరగతి దిగువస్థాయిలో వున్నా ఉన్నత తరగతి దర్జా ఆమె మాటల్లో, చేతల్లో.

"ఆయన ఇంట్లో లేదు నివాళి!"

"ఊళ్ళోనే వున్నాడా? ఎన్నింటికి వస్తాడక్కా?"

"ఊళ్ళోనైతే వున్నాడు. పలానా టైంకు వస్తాడని చెప్పలేను" అలా చెప్పటంలోనూ బేషజం ప్రదర్శిస్తుంది.

సువాణి ఆర్.టీ.సి.లో కండక్టర్. ఆరోజు రెస్ట్. ఇంట్లో వుంటుందనే నివాళి వచ్చింది.

"ఏంటి పని అయనతో?"

"మా అమ్మ ఆయనతో మాట్లాడాలంట, చూచిరమ్మంది".

కాకి డ్రస్, చేతిలో చిన్నపాటి తోలు సంచితో సువాణి బయటికి వచ్చినప్పుడు వీధిలోని ఆడవాళ్ళు అదో రకమైన చూపులో లోలోనే కుళ్ళుకోవడం ఆమె ఎరుగును. అది అసూయో, అక్కసో తన సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తోందనో. "వెధవ ఉద్యోగం, మగ వాళ్ళను తాక్కుంటూ, చిల్లరకు గొడవపడుతూ, రాత్రనక, పగలనక, ఒక్కో రోజు ఎక్కడెక్కడో రాత్రిళ్ళు నిద్ర". ఇవ్వన్నీ వాళ్ళ హృదయాల్లో మెదలటం ఆమెకు ఎరుకే. వాళ్ళలో నివాళి అమ్మ ఒకతె. నలుగురూ కలిసి నవ్వే వేళల సువాణి ఒకింత గర్వపడుతుంది. వాళ్ళకు లేని ఉద్యోగం, వ్యాపకం సంపాదన తనకొక ప్రత్యేకమైన గుర్తింపు.

"పల్లె బస్సుల్లో లగేజికి టిక్కెట్టు కొట్టరు. డ్రైవరు, కండక్టరే పంచుకుంటారంట. లేకపోతే రోజూ బిరియాన్లు, మందు సీసాలు ఎక్కణ్ణించి వస్తాయి! ఆదివారం వస్తే కేజీలకు కేజీలు మాంసాలు. వీళ్ళంతా రేపు దేవుని దగ్గర ఏం జవాబు చెప్పుకుంటారో? పై వాళ్ళకు దొరికితే ఉద్యోగం ఊడదూ?"అని నివాళి అమ్మ గుంపులో గోవిందంగా మాట్లాడినప్పుడు సువాణి నొచ్చుకుందో, పుచ్చు, కుళ్ళుమాటలని కొట్టి పారేస్తుందో!

[illegible]

మార్కెట్‌లోకి తప్పక పోతాడు నగేశం. ఆదివారం అదొక వ్యాపకం. తన వంతు వచ్చిమాంసం కవరు బుట్టలో పడేప్పటికి కనీసం నాలుగు పొడుగుపాటి ఫిల్టర్ గోల్డ్ సిగరెట్లు ఊదేస్తాడు. ఈలోగా రెండో మూడో టీలు. సిరాజ్ ఇచ్చే మాంసం కల్తీ లేనిది. కళ్ళముందే కోసి భాగాలేస్తాడని అంటారు.

"అన్నా! రేపు శనివారం ఫ్యామిలీతో తిరుమలకు వెళ్ళాలనుకున్నాం. అకామడేషన్, దర్శనం అరేంజ్ చెయ్యాలన్నా" అన్నాడు శిఖామణి. సి.టి.ఓ. ఆఫీసులో ఇన్స్పెక్టర్. సొంత యిల్లు. కారు, బ్యాంక్ బ్యాలెన్స్‌తో విలాసవంతమైన జీవితం. బిడ్డలు పెద్ద చదువుల్లో. మటన్ కొట్టు దగ్గరే పరిచయం. తన ప్రాపకం. ప్రావీణ్యం, పరిచయాలు గురించి అడిగినా, అడక్కపోయినా పదిమంది ముందు పరుచుకోవడం నగేశం అలవాటు. అది చాలా అవసరమంటాడు. "ఎవరైనా వివరాలు ప్రశ్నిస్తేనే గదా! నేనెవరో, ఏమిటో? చెప్పుకోకపోతే ఇతరులకు ఎలా తెలుస్తుంది?'' అలాంటి పరిచయమే శిఖామణితో.

జిల్లా కేంద్రాలు మొదలు హైదరాబాదు, ఢిల్లీ వరకు విస్తరించి వున్నట్లు నగేశం మాటల్లో వింటాం. ఏ ఆఫీసు పేరు చెప్పినా, ఆ ఆఫీసులోని నలుగురైదుగురి పేర్లు గడగడ చెప్పేస్తాడు. ఆ ఆఫీసులో తనకు తిరుగు లేదన్నట్లు. ఎదుటివాడు చిత్తు. మాట్లాడేటప్పుడు. అది బస్సుగాని, రైలుగానీ, కారుగాని, ఇతరులకు మాట్లాడే అవకాశముండదు. నోరు వెళ్ళబెట్టి వినటం తప్ప.

అప్పటికప్పుడు సెల్‌ఫోన్ నెంబరు నొక్కి తిరుమలలో ఒకతనికి శిఖామణి విషయం చెప్పాడు.

"మీరు ఎంత మంది పోతున్నారు?" మధ్యలో శిఖామణినడిగాడు.

"ఆరు మంది నేనూ నా భార్య, ఇద్దరు పిల్లలు, అమ్మా, నాన్న?"

"రామ్ బగీచాలో అరేంజ్ చెయ్యి. నాకు బాగా కావలసినవాళ్ళు. దర్శనం, ప్రసాదం వగైరాల్లో లోపం రాకుండా చూడు". ఫోన్ ముడిచి "మీ పని అయిపోయింది. అతని ఫోన్ నెంబర్ ఇస్తాను. తిరుమలకు చేరుకోగానే కాంటాక్ట్ చెయ్యండి రెడీగా ఉంటాడు" మెహర్బానిగా శిఖామణే ఇద్దరి మాంసం బిల్లు చెల్లించాడు. అవసరాలు అలా తీరుతాయి నగేశానికి.

శిఖామణి దిమ్మెరపోయాడు. ఒక్క

రిక్వెస్ట్‌తో అంతా క్షణాల్లో సెటిల్‌మెంట్! తన బంధువులకు ఫోన్‌చేసి కాదనిపించుకున్న శిఖామణికి నగేశం పలుకుబడి 'ఇంత' అని అంచనాకు రాలేకపోయాడు.

తిరుమలకు వెళ్ళి తలనీలాలు సమర్పించుకున్న బోడిగుండు రూపంతో మటన్ మార్కెట్ వద్ద నగేశంను కలిసి థాంక్స్ చెప్పాడు మరుసటి వారం.

'దట్సాల్' అన్నాడు. నలుగురికీ ఉపయోగపడటమే తన జీవిత లక్ష్యం అన్నట్లు ఫోజు పెట్టి. ఆరోజు కేజి మటన్ ఖర్చు రెండు వందలు కూడా శిఖామణే చెల్లించాడు. "వద్దు - వద్దు" అన్నాడు నగేశం జేబులో చెయ్యి పెట్టి ఇవ్వబోతున్నట్లు నటిస్తూ, ఆ చెయ్యి పనయ్యేదాకా బయటికి రాదు.

తిరుమలలో శిఖామణి కుటుంబానికి ఏ ఇబ్బందీ రాకుండా అక్కడి వ్యక్తి సహకరించాడు. తన భోజనాలు, టిఫిన్లు వాళ్ళ ఖర్చులోనే జరిగిపోయాయి.

"మరి నాకు సెలవా?" నసిగాడు ఆ వ్యక్తి సాగనంపేప్పుడు.

"ఉండండి. మీ హెల్ప్ మరవరానిది. ఇదివరకు ఎన్నోసార్లు ఇక్కడికి వచ్చినా ఇంత సౌకర్యం ఏనాడూ లేదు". అయిదు వందల నోటు చేతిలో పెట్టాడు శిఖామణి.

"సర్! మాదొక నెట్‌వర్క్ కూటమి. తాలూకా, జిల్లా కేంద్రాల నుండి మాకు పరిచయాలు. అయిదు వేలకు తక్కువ తీసుకోం, ఇందులో నగేశంతో పాటు అందరికీ భాగాలు" అన్నాడు.

శిఖామణి లోలోన ఎంత కుళ్ళుకున్నాడో తెలీదుకాని, అయిదు వందలు వెనక్కు తీసుకోలేదు, మరో అయిదువేలు చేతిలో పెట్టి సెలవు తీసుకున్నాడు. "సి.టి.ఓ. ఆఫీసులో మానెట్ వర్క్‌కు ఇదేమీ తగ్గదే" అని లోలోపల. నగేశం నిజ రూపం తెలిసినా దొంగకు తేలుకుట్టినట్లు మౌనం. నగేశానికి తెలుసు నోరు తెరిస్తే బొంకు బయటపడుతుందని.

"నీ కోసం నివాళి వచ్చిపోయింది" ఇంటికి వచ్చిన భర్తతో సువాణి.

"నివాళి ఎవరు? ఓహో! ఆ మధ్య పెళ్ళైన పిల్లా? ఎందుకంట?"

"వాళ్ళమ్మ నీతో మాట్లాడాలని రమ్మనింది".

"పని వాళ్ళది. అవసరమైతే వాళ్ళే వస్తారు. స్నానానికి నీళ్ళు పెట్టు". భర్త చాలాకాలంగా అమె మొఖం తప్పించుకు తిరగడం సువాణి ఎరుగదు.

"వాళ్ళు పెద్ద ఆసాములు. పోతే మన విలువ తగ్గుతుందా?" నసిగింది.

తన ఇంటికి ఒకరు, ఇద్దరు, గుంపుగాను, కాల్నడక, బైక్‌లో, కారులో రావడం చూపరులకు తన గొప్ప వెల్లడి. తానొకింత గర్వపడటం, ఒకప్పుడు విసుగు పడటముంది. నగేశం బాత్రూమ్‌లో ఉండగా బిలబిలమంటూ పది మంది. వాళ్ళలో ఒకరిద్దరు పరిచయస్తులు, అందరికీ కుర్చీలో, స్టూల్లో చూపించడం కష్టమయ్యింది సువాణికి. భర్తను నిలదీసే ప్రయత్నంలా కన్పించి ఒకింత చలించింది. స్నానం ముగించి తల తుడుచుకుంటూ బైట వున్న గుంపును చూసి రాని నవ్వును ముఖానికి పులుముకుని పొడి పొడి పలకరింపులతో సరిపెట్టి వాళ్ళ ముఖాల్లో ప్రశ్నల దొంతర్లు సిద్ధంగా వుండటం గుర్తించాడు నగేశం. క్షణాల్లో సమాధానాలు వెతుక్కోగల దిట్ట.

"మీ గురించే రాత్రి చాలాసేపు మాట్లాడాను. ఫోన్‌లో కార్డు వేయించాలి. అబ్బీ! శ్రీనాథ్! దగ్గర్లోనే సెల్ పాయింట్ ఉంది. రోడ్డు దాటక్కర్లేదు. ఇదిగో! ఉండు, డబ్బిస్తాను అంటూ లోనికి వెళ్ళి ఎంతకీ రాకపోగా, ఒకతని కనుసైగతో వంద అర్థాలు స్ఫురించి శ్రీనాథ్ ఫోన్ తీసుకుని బయటపడ్డాడు. అతణ్ణి ప్రసన్నున్ని చేసుకోవడంలో అదొక భాగం.

గుంపుతో బయట పడ్డాడు నగేశం.

బైటికి వెళ్ళాడంటే శక్తికి మించిన భారం నెత్తికెత్తుకుని దించుకోడానికి నానాపాట్లు. నిశ్చితమైన వృత్తికి వేళలుగాని గాలి తాకిడికి కొట్టుకుపోయే ఒగుదాక్కు ఏ దిక్కు? అబద్ధపు బ్రతుక్కు ఆలోచనలు అనంతం. ఎప్పుడో రావటం - చుక్క తెగిపడినట్లు. సువాణి పట్టించుకోదు.

"పంచాయతీ పెట్టిస్తారంట. ఏం పీక్కుంటారు? నాకుండరూ పెద్ద మనుషులు?" ధుమ ధుమ లాడుతూ బట్టలు మార్చుకునేందుకు గదిలోకి వెళ్ళాడు.

"వాడు - ఆ పొట్టి నా కొడుకు మణి, పుట్టసెండు మాదిరి ఎగిరెగిరిపడతాండాడు. కాళ్ళూ, సేతులూ ఇరిసేవాళ్ళు లేక డబ్బంతా నేనే తిన్నట్లు".

"భోంచేస్తావా!" ఏ విధమైన ఆసక్తి, తొట్రుపాటు లేకుండా అడిగింది. "దిన దిన గండం, నూరేళ్ళ ఆయుష్షు తప్పుకు తిప్పలు తప్పవు" సువాణి తనలో అనుకుంటుంది.

"వాళ్ళు పెట్టిందే అరగలా, ఇంగా ఏంది భోంచేసేది?" ఒక పిడస తగలెయ్". విసుగ్గా, విసురుగా నగేశం.

"డబ్బు తిన్నవాడికే ఇంత కాంతాలమైతే, మరి పోగొట్టుకున్న వాళ్ళకెంతుండాలి?" సువాణి ఆలోచన ఇలా సాగుతుంది. "అలివిగాని పనులు ఒప్పుకొని ఇప్పుడెందుకీ హైరానా" అనాలనుకుంటుంది గాని, "ఆడ దాని సంపాదన మీద బతుకుతున్నానని కదూ!" అని యెదురు దాడికి దిగుతాడని ఏ వూసెత్తదు. అప్లికేషన్ పెట్టడం. ఇంటర్వ్యూకు తోడు రావడం కూడా ఉద్యోగం సంపాదించుకోవడంలో భాగమని అనుకొనే వెంగళప్పతో ఏమ్మాట్లాడినా ఘర్షణే అనుకుంటుంది సువాణి.

"ఇదేదో పెద్ద రభస అయ్యేట్లు వుందే! పంచాయతీ అంటే చాటున జరిగినవన్నీ ఎదుటికి వస్తాయి. మీ ఒప్పందాల్లో నిజమెంతో లోపాయికారి తనమెంతో? కరగదిన్నది కట్టమంటే - ఇల్లైనా లేదు కుదువ పెట్టేందుకో, అమ్మేందుకో" అన్నం వడ్డించి ఎదురుగా పీటపై కూర్చుని సణిగింది.

"నేనొక్కన్నే కరగదిన్నానా? ఇంటి వాళ్ళే శత్రువులైతే యింతే, ఆ నగలన్నీ ఎలా వచ్చాయి? షిరిడీ అని, పావ్‌గఢ్ అని అదని - ఇదని లెక్కంతా తీన్‌చార్ చేసింది నువ్వా



మే 29న జరిగిన శేషేంద్ర శర్మ ద్వితీయ వర్థంతి సభలో డా॥ రావూరి భరద్వాజ, డా॥ ఎన్. గోపి, డా॥ సి. నారాయణరెడ్డి, సాత్యకి తదితరులు పాల్గొన్నారు

నీ కొడుకులు కాదూ! ఎక్కితే కారు, దిగితే కారు!"

"అవునయ్యా! మేం లక్ష అడుగుతాం, ఇచ్చుకోవాల్సి వచ్చినా అచ్చుకోవాల్సి వచ్చినా నువ్వే రానంటే ఊడ్చుకు పోయినామా?"

"నీ నగలకైంది ఎంత? బండి కొనుగోలు కెంత? నా శక్తికి మించి ఖర్చు చేసినా దెప్పి పొడుపు నాకే. అరచేతిలో వైకుంఠం చూపించి ముగ్గులోకి దింపింది హైదరాబాదు నా కొడుకులు, జేబులు పిండి నన్ను నలిపి వాళ్ళు, కడుపు కాలి వీళ్ళు, గోడకు కొట్టిన సున్నం గోకితే గోళ్ళు పోవడమే కాని గోరంతన్నా రాలుతుందా? తిన్న వాళ్ళు సెక్షన్లు మారి, అసలు ఊరే మారి రిటైరై చచ్చి - చేపంత పెంట తిన్నా చేప దొరకదు. ఎవరికి చెప్పుకొనేది?"

❧ ❧ ❧

నివాళి అమ్మ పేరు వాసమ్మ. భర్త బ్యాంక్ ఆఫీసర్. పెత్తనం అంతా ఆమెదే. పల్లెలో పొలాలు. టౌన్‌లో తాముండేది కాక మరోరెండిళ్ళు. నగేశంది దేగకన్ను. ఎక్కడ నొక్కితే జల ఊరుతుందో ఎరుగును. న్యూస్ పేపరులో వచ్చిన ఒక ప్రకటన కట్ చేసుకొని వానమ్మను కలిసి ప్రకటన సారాంశాన్ని ఆమెకు విప్పి చెప్పాడు. వివరణ ఇవ్వడంలో అతడి ఒడుపు చాలామందికి అరుదు. విషయం చుట్టూ ఒక వలయం అల్లేస్తాడు. అవతలి వ్యక్తి ఆ వలయంలో చిక్కుకొనేట్టు. తమ వద్ద ఎన్ని ప్రశ్నలున్నా తుప్పున లేచిపోతాయి. అప్పటికప్పుడు పెరట్లో శ్రీ గంధం టేకు మొలిపించి, ముదురును చేసి, లక్షలు చేతిలో వాలేట్లు కథ అల్లగలడు. ఎదుటివాడు ఊహల్లో తేలుతూ కళ్ళెదుట లక్షలు ఎంచుకొంటున్నట్లు కలలు.

"రిస్క్‌లేని పని అక్కా! అయిదు వేలకో, అంతకు లోపో ఒక ఇల్లు అద్దెకు తీసుకుందాం. మూడేళ్ళకు అగ్రిమెంట్. బయట పెద్ద బోర్డ్-గర్ల్ స్టూడెంట్స్ హాస్టల్ (సెంట్రల్ గవర్నమెంట్ సహకారముతో) రెండు వందల మందిని వివిధ కళాశాలల్లో చదివే యస్సీ, ఎస్టీ వాళ్ళ జాబితా తెస్తాను. డి.ఇ.వో. లేదా అంతకంటే పెద్ద ఆఫీసర్ ఎంక్వయిరీకి వచ్చిన రోజు వాళ్ళకు కావలసిన అన్ని సదుపాయాలు చేసి ఇవ్వాల్సిందిచ్చి శాంక్షన్ రిపోర్టు తయారు చేసి పైకి పంపుదాం. ఒక్కొక్క విద్యార్థికి నెలకు పదిహేను వందల చొప్పున మెస్ ఛార్జీలు, అదనంగా పై ఖర్చుకు అయిదు వందలు ఇస్తారు. మూడేండ్లు నడిపి ఆపైన వీలయితే సరి లేదా మూసేస్తాం." "పెట్టుబడిఏమాత్రం అవసరమన్నా?"

"సంవత్సరానికి అరవై వేల చొప్పున లక్షా ఎనభై, ఒక ఇరవై ఆఫీసర్ల చుట్టూ తిరిగేందుకు. మొత్తంగా రెండు లక్షలు. ఏ సంవత్సరానికా సంవత్సరం ఒక్క చెక్కులోనే చెల్లింపు. నా ఖర్చూ కొంత ఉంటుందనుకో".

"మా ఆయనకు తెలీకుండా అప్పో, సప్పో చేసి తెస్తాను. ఇందులో మోసమేమీ లేదు కదా! పొరపాటయ్యిందో మా ఆయన నా జుట్టు పట్టుకొని బజారుకీడ్చి తంతాడు."

"నీ గౌరవం నా గౌరవం కాదా అక్కా! పెట్టుబడి లేకగాని, ఉంటే మా భార్యతోనే ఈ పని చేయించి వుందును. మూడేండ్లకు ఇన్ని లక్షలు కళ్ళముందు జారిపోవడమా? ఇతరులకంటే ముందే మనం ఫార్మాలిటీస్ పూర్తిచేస్తే ప్రాజెక్టు సులభంగా చేజిక్కించుకోవచ్చు. మరొక విషయమక్కా, అన్నీ కాగితాల్లో లెక్కలే, నిర్వహణ ఉత్తుత్తిదే. వంటా లేదు వార్పు లేదు. పొయ్యి ముట్టించే పనే లేదు."

## 'ఒకే ఒక్కడు

— హిందీ మూలం —

**నంద కిశోర్ నంద**

— తెలుగు అనువాదం

**రావెల సాంబశివరావు**

అవును, అతడు జగమొండే
ఎందుకంటే-
శతాబ్దాలుగా
అవమానితులు, వంచితులు
తిరస్కృతులైన
కోట్లాది మందికోసం పోరాడే
ఒకేఒక్కడు అతడు!
ఎందుకంటే
కోటు బొత్తాములో
గులాబీని ఇరికించి
టాటా బిర్లాల కోసం
సోషలిజాన్ని తేవాలని
ప్రజారాజ్యం పై కప్పిన
గులాబీ మేలిముసుగును
తొలగించి వేసిన
ఒకేఒక్కడు అతడే!
ఎందుకంటే
ఓ నటనాలయంగా
కాదు,కాదు- వేశ్యాగృహంగా
మారిన పార్లమెంటును
కోట్లాదిమంది కష్టాలకు
అద్దంపట్టేట్లు చేసిన వాడతడు!
అవును! అతనొక జగమొండే

శతాబ్దాలుగా పేరుకుపోయిన
కల్మశాన్ని, పంకిలాన్ని
ఎండగట్టి, పెచ్చులూడేట్లుచేసి
కోట్లాది ప్రజల పెదాలపై
నవనవోన్మేషపు
చిరునవ్వులు చిందించిన వాడతడు
అతను కోరుకున్న
సరికొత్త ప్రపంచంలో
భవిష్యత్ భారత దేశంలో
ప్రజలంతా ఒక్కటే
జాతులు కులాలతో
ముక్కలు చెక్కలైన ప్రపంచాన్ని
ఒక్కతాటిక్రిందికి తెచ్చేందుకు

అమెరికాలో సైతం
యుద్ధంచేసిందతడేకదా!
రాజుపోయాడు
రానేవచ్చింది రాకుమారి పాలన
"నిర్మూలించండి ఈ వంశ పాలనావాదా
అంటూ వంచితులకు
పిలుపునిచ్చిందతడే.
అతలాకుతలమయ్యింది
వంశపారంపర్యపు సింహాసనం.
ఎట్టకేలకు రానే వచ్చాడు
అతడూ ఒక రోజు ఆసుపత్రికి
వేదనంతా గుండెలోనే గూడుకట్టి,
అది కోట్లాది మంది ఆత్మవేదనే.
మూతపడే కళ్ళల్లో
మందగించిన ఊపిరిలో
దీనంగా వేలాడే కోట్లాది ముఖాల్లో
నేటికీ అలాగే నిల్చిఉన్నాయి.
అవును అతడుజగమొండే
కోట్లాదిమంది కోసం పోరాడే
ఒకే ఒక్కడతడు!

(లోహియా శతజయంతికి "సామయిక్ వార్తా" హిందీ మాసపత్రిక సౌజన్యంతో)

ఇంటి అద్దె, బోర్డు ఖర్చు, రవాణా, ఫోను బిల్లు - వెరసి మూడు సంవత్సరాలకు మాడు పగిలినట్లయ్యింది. ఇదిగో రేపు వారం, అదిగో రేపు నెల అని అధికార్ల ఎంక్వైరీ గురించి ఊరించి, ఊరించి వాళ్ళ నెపంతో మరికొన్ని ఖర్చులు చూపించి ఆమె నెత్తిన నిప్పుల కుంపటి పెట్టించాడు. రహస్యంగా వచ్చి చుట్టుప్రక్కల ఇళ్ళ వాళ్ళనడిగి అక్కడ హాస్టల్ జరగలేదని రిపోర్టు. పై అధికారులు పంపిన రిజెక్షన్ ఆర్డర్స్ సంగతి ఆమెకు తెలీకుండా మరుగు పరిచాడు. రేపో, మాపో బిల్లు మొత్తం లక్షల్లో ఊడిపడుతుందని అమాయకురాలు పగటి కలలు. తాను మింగింది చెప్పడు.

ఈలోగా ఉపాధ్యాయ నియామకాల నోటిఫికేషన్ చూసి నగేశం చౌరస్తాలో పెద్ద దుప్పటే పరుచుకు కూర్చున్నాడు. తన వ్యాపకం. ప్రాపకం ఆనోటా ఈనోటా పడేశాడు. ఇంకేముంది. అది సుడిగాలిగా వ్యాపించి నిరుద్యోగుల తాపాన్ని చల్లార్చింది. ఏదో ఒక మార్గం. దాని అనుపానులెరిగినవాడు గట్టెక్కిస్తాడని అంతరాంతరాల్లో ఆశల మోసులు.

నగేశం వద్ద ప్రణాళిక సిద్ధమైంది. ఒక్కొక్కడికి రెండు లక్షలు, పదిమందికి వెరశి ఇరవై. అయిదేళ్ళకొక్కసారైనా ఆమని ఆ మనే. భాగ్యనగరం ఓ లాడ్జిలో నెల ఒప్పందం. ఇక ఒకటే తిరునాల. పేపర్ లీక్ నుంచి పరీక్షల గండం గట్టెక్కే వరకూ ఎన్ని పల్టీలో? చీర లేకుండా మూర కొల్వడం. అందరి నెత్తిమీద ఆశల వెల్లగొడుగు దిగి తెల్ల గుడ్డ పడింది.

మునుపోక దివాలా కంపెనీకి కొమ్ము కాసేందుకు పేరు మోసిన ఫ్యాక్షనిస్టును ఆశ్రయించి తలబొప్పి కట్టి తప్పించుకున్నాడు. ఇప్పుడు ఈ ఫెయిల్యూర్ ఏ దిశకు నడిపిస్తుందో?

నగేశం ముందు సమస్యలుంటేనే నిద్రపడుతుంది. నిద్రలేంది అతణ్ణి ఆశ్రయించిన వాళ్ళకు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం వేసిన గాలం తన గొంతులోనే ఇరుక్కొంది. ఒక పెద్ద ఫ్యాక్షనిస్టు వద్ద పంచాయతీ. తేదీ ఖరారు పోతే ఇరుక్కోవాలి. పోకపోతే చావాలి. తన తరఫున పదిమందిని పోగేసి పంచాయతీ ముందు నిలబెట్టాడు.

"ఉద్యోగం గ్యారంటీ పేరుతో వీళ్ళ డబ్బు గుంజావా?" పంచాయతీలో పెద్ద మనిషి ప్రశ్న.

"నేను వాళ్ళింటికి పోలే వాళ్ళే నా యింటికి వచ్చారు"..

"ఎవరింటికి ఎవరు పోతేయేం? డబ్బు గుంజావా? లేదా?"

"నాకివ్వలేదు. నేను ఇవ్వమన్న వాళ్ళకిచ్చారు?"

"ఒక్కరికీ ఉద్యోగం రాలేదు. ఆ డబ్బు తిరిగి వచ్చే మార్గం."

"వాటుకు అయిదు పదిమంది చొప్పున వచ్చి, లాడ్జీల్లో దిగి, తాగి, తిని, బస్సులకు, ఆటోలకు విలాసాలకు తగలేసి ఈరోజు "డబ్బు" అంటే ఎలా వస్తుంది?" నగేశం ఎదురుదాడి.

ఫ్యాక్షనిస్టు వాళ్ళవైపు సాలోచనగా చూశాడు. "అన్నా మేం పోయింది నిజం. ఖర్చులు నిజం. ఈ ఖర్చంతా అతనికిచ్చిన డబ్బులోది కాదు. మా సొంతం" పంచాయతీ దారు నగేశం వైపు ఉరిమి చూశాడు.

"వాళ్ళు నాకైతే ఇవ్వలేదు, ఇవ్వమన్న వాళ్ళకే ఇచ్చారు. అయినా పని కాలేదు. ఇప్పుడు నేను చేసేదేముంది?"

"అందులో నీ వాటా ఎంత?"

నగేశం నీళ్ళు నమిలాడు. "సాయమడి గారు, తోవ చూపెట్టాను, వాటాలేముంటాయి?" ఎదురు ప్రశ్న.

"వాళ్ళేమిచ్చారో, నీవేంతిన్నావో, ఆరు నెలల్లో మనిషికి ఏభై వేల చొప్పున అయిదు లక్షలకు బాండు రాయించు. అది నా వద్దే వుంటుంది. తప్పావో నీకు జైలేగతి. నమ్మి నష్టపోయిన వాళ్ళకూ ఇది ఒక గుణపాఠం. బాండుపై సంతకం తీసుకొని పంచాయతీ దారు సభ ముగించాడు - నగేశం గొంతుపై చురకత్తి పెట్టి.

నివాళి పట్టు విడవక మళ్ళీ నగేశం కోసం వచ్చింది. హాస్టల్ విషయం గుండెను కెలికింది. ఏదో ఒకటి చెప్పి తప్పించుకు వచ్చేందుకు మెదడుకు పదును పెట్టుకున్నాడు. ఒక కాగితం ఇలా తెరచి అలా మూసి గండం నుండి గట్టెక్కాలని, ఎవరన్నా తిట్ల పురాణం విప్పితే చెవిటి వాడయిపోతాడు. అవసరం అవతలి వాడిదయితే తన కత్తికి ఇరువైపులా పదునే.

"పిల్చినావంట గదక్కా. అది ఇంగా ఒక కొలిక్కి రాలేదక్కా! నెట్‌వర్క్ అంతా సరిచేశాను, ఏ క్షణాన్నైనా ఆర్డర్ రావచ్చు".

"అది ఉండనీ అన్నా! అంతా నువ్వే చూసుకుంటున్నావు కదా! ఎక్కడ సంతకం చెయ్యాలో నీకే తెలుసు. ఇటీవల నివాళి పెండ్లి అయ్యింది కదా! అల్లుడు గ్రూప్-1 పరీక్ష వ్రాశాడు. పిలుస్తానుండు, వివరాలిస్తాడు. "శ్యామూ! ఒక్కసారి ఇలారా? నగేశమన్నతో మాట్లాడు". పరస్పరాభివాదాలు, పరిచయాలు, కాఫీలు.





240 పేజీలు
వెల :
రూ॥ 150 /- లు

**నండూరి రాజగోపాల్**

**"అనంతరంగాలు"**

**సాహిత్య పరామర్శ**

**23-11-2008 న విజయవాడలో ఆవిష్కరణ జరిగింది.**

**ఈ పుస్తకం కావలసినవారు రూ॥ 100/-లు ఎం.ఓ ద్వారా పంపించగలరు. పోస్టేజి ఉచితం.**

**మేనేజర్, చినుకు ప్రచురణలు, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 520 003.**

**ఫోన్ 0866-6640595, సెల్ : 98481 32208**

"మీ గురించి అత్తయ్య చెప్పింది. రిజల్ట్స్‌పై గట్టి నమ్మకముంది. అయినా పోటీల రోజులు. తారుమారుల కాలం. మన ప్రయత్నం మనమూ చెయ్యాలి కదా!"

పోస్టు తక్కువ. పోటీ ఎక్కువ ఉంది. మళ్ళీ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో, రాదో! ప్రభుత్వాలే ఈ రోజున్నవి రేపు లేవు. ఈలోగా వయస్సు దాటిపోతే ఆ అవకాశం కూడా ఉండదు. డబ్బుదేముంది, మంచి పోస్ట్ వస్తే సంవత్సరంలో తీరుద్దీ" ఉత్సాహానికి మరింత ఎగదోశాడు నగేశం, తేనెపట్టు ఇంటి చూరుకు వేలాడబోతోందని.

"హైదరాబాద్‌లో మీకు పరిచయాలున్నట్లు అత్తయ్య చెప్పింది. మీరు సరేనంటే మనీ విషయం జాగ్రత్తపడతాను"

"సర్వీస్ కమీషన్‌లో ఒకరిద్దరు కమిటీ సభ్యులు తెలుసు. (గబ గబ నాలుగు పేర్లు చెప్పి) నీ ఇంటర్వ్యూనాడు ఎవరు వచ్చినా పని జరిగిపోవాలి. రిటన్ ఎగ్జామ్ మాటేమిటి?"

"దాని గురించి దిగులు లేదు. మంచి కోచింగ్ తీసుకున్నాను. పాస్ గ్యారెంటీ. ఇంటర్వ్యూ గురించే ఈ ప్రయత్నమంతా."

"నాకు నాల్గు రోజులు గడువిస్తే వివరాలన్నీ సేకరిస్తాను. రాజకీయంగా మీకేమన్నా బలముందా? అట్నుంచి కూడా నరుక్కొవొస్తే పని సులభం" తాను బాధ్యత నుండి బయటపడేందుకీ మార్గం. చేతులు పిసుక్కుంటూ కూర్చున్నాడు.

"ప్రస్తుతం ఈ రెండు వేలు ఖర్చులకుంచండి". శ్యామ్.

మనీ ప్లాంట్‌లా సహస్ర ముఖాల అల్లుకుపోవడం నగేశం నైజం. ఇప్పటికే రెండు ట్రాన్స్‌ఫర్లు. ఒకటి డేట్ ఆఫ్ బర్త్ కరెక్షన్, సెకండరీ ఎజుకేషన్ ఆఫీసులో మార్కులిస్టుల విడుదల, ఇలాంటివే మరికొన్ని కలుపుకొని ఇరవై వేల మొత్తంలో సగం ఇల్లు చేర్చి మిగిలిన సగంతో కంట్రీ క్లబ్‌లో మకాం. అక్కడ ఉన్నన్ని రోజులు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంటుంది. తిరిగి వచ్చినా ఒకటి రెండు రోజులు ఫోన్ల ద్వారానే సమాచారం అందిస్తాడు. భార్య మర్మం భర్తకు, భర్త మర్మం భార్యకు ఎప్పుడూ బయట పడదు. సాధ్యమైనంత వరకు మనిషి అజబాబులుండవు.

శ్యామ్‌కు సర్వీస్ కమీషన్ మెంబర్ల లిస్టులో మరో రెండు పేర్లు చేర్చి నమ్మించాడు. మాటల్లో ఎప్పటికప్పుడు పనిలోని గాఢత, వ్యగ్రత రెండింతలు, మూడింతలూ అవుతూ వుంటుంది. అక్కడా ఇక్కడా జరిగే చర్చలు సొంతమైపోయి, మరికొంత సమాచారం సేకరించి అవతలివాణ్ణి బురిడీ కొట్టించి కాలక్షేపం.

"ఏమన్నా! ఈ మధ్య ఊళ్ళో ఎక్కడా కనిపించవు" అని ఎవరైనా పలకరిస్తే "నెలలో ఎక్కువ భాగం హైదరాబాదే" అంటాడు. అరువు దెచ్చుకున్న డాంబికంతో. ప్రతి పనినీ నెలలకు నెలలు సాడిగించుకుపోతాడు. ఆఫీసర్ క్యాంప్‌ని. ట్రాన్స్‌ఫర్‌ని, ఆఫీసర్ కూతురి పెళ్ళిని, కోడలి ప్రసవమని, భార్య అనారోగ్యం, మంత్రితో మీటింగ్, ఏదీ లేకపోతే ఆఫీసర్ ఫారిన్ ట్రిప్‌కు తానే టికెట్ కొని విమానమెక్కిస్తాడు.

"అన్నా! అల్లునికి అయిదు లక్షలిచ్చి, ఏడు లక్షలు ఉద్యోగానికని మావద్దే వుంచుకున్నాం. ఆ మొత్తం వరకు వాళ్ళకు మాటివ్వు, ఖర్చులు మేమే భరిస్తాం" అంది వాసమ్మ.

"ఆమాత్రం పడుతుంది లేక్కా. అన్నీ సరిచేసుకునే వచ్చాను, డబ్బు చేతులు మారేప్పుడు మీరే ఉంటే మంచిది, అపార్థాలుండవు" అవతలి వాణ్ణి నమ్మించేందుకు అదొక ఎత్తు.

"అల్లుణ్ణి పంపిస్తాలేన్నా. దాందేముంది? దేనికైనా అదృష్టం ముఖ్యం."

అదృష్టమనే మాటే స్వర్గం దాకా నిచ్చెన ఎక్కిస్తుంది నగేశాన్ని. ఆపైన అంతా విశ్వామిత్ర సృష్టే.

రాత పరీక్షలో నెగ్గిన శ్యామ్‌సుందర్‌కు పదవి కనుచూపు మేరలో ప్రత్యక్షమై నగేశం చేతిలో ఏడు లక్షలు పోశాడు. ఇక గడప మీది కాలు అటో - ఇటో.

ఇంటర్వ్యూ అయిపోయింది. శ్యామ్ పేరు సెలక్షన్ లిస్టులో లేదు.

నగేశం నెలరోజులు అదిలాబాదో, నిజామాబాదో, హైదరాబాదో - ఏదో ఒక బాదులో, ఫోన్ మోగని బాదులో.

జేజారిన డబ్బు, రాని ఉద్యోగం కొత్త కాపురంలో పెద్ద చిచ్చే రగిల్చింది.

కట్నం అంతా తేలేదని తల్లిదండ్రులు, ఉద్యోగంలేని అల్లుణ్ణి మోయలేమని అత్తమామలు, ఎటూ తేల్చుకోలేని శ్యామ్ అజ్ఞాతంలోకి.

నివాళికి మళ్ళీ పెళ్ళి ప్రయత్నంలో తల్లిదండ్రులు.

అయిదు లక్షల బాండు డిక్రీ కావడంతో నగేశం జైలుపాలనీ, సువాణి మరో డిపోకు బదిలీ అయ్యిందనీ వదంతి.

# వర్తమానం నా రూపం

## మాదిరాజు రంగారావు

వర్తమానం నా రూపం
నా రూపం వర్తమానం
అందని హరివిల్లు లేదు, భావనలో
మానవతా సుందర పద పంక్తి తప్ప
బీజం నవ రూపం పొందుతూంది.
ఆలోచన పచ్చదనం పరుస్తూంది.
ప్రజాస్వామ్య చిహ్నం గమ్యం నిర్దేశిస్తూంది.
కాలం కదులుతూంది.
అడవిలో గుడిసె
ఎప్పటిదో తెలియదు.
అమ్మ కొంగు చివర
ముడివేసిన రూపాయి నాణెంలా.
మనిషి విలువ మరవబడీ
అడవిలో గుడిసె.
ఊరు చివర గుడిసె
ఎప్పటిదో తెలియదు.
అమ్మ కొంగు చివర
ముడి వేసిన రూపాయి నోటులా.
మనిషి విలువ వెనకబడీ
ఊరు చివర గుడిసె.
కాలం కదులుతూంది వేగంగా.
చింతనలో స్వర్గానికీ
యోచనలో దేవతలకూ
ఏ స్థానం లేదీ సమయం
సమ న్యాయం కోరే మతిలో
ఊళ్ళూ నగరాలూ దేశాలూ ఖండాలూ దాటి
సామాన్యుని కోరిక నీడకు కూడా అందని
దూరంలో ప్రపంచ ఖజానా వరకూ
కాలం పరుగెత్తుతూంది అశ్వంలా, ఈరోజు.
వ్యక్తిలో స్వేచ్ఛగా నిటారుగా నిలకడగా
రవి రశ్మిని తలపించే అసలు రేఖ!
దీని ముందు తల వంచుతుంది
హిమ కిరీట శిఖర మస్తకం.
గుడిసెల ముంగిట్లో
రాలే కన్నీటి చుక్కల దృశ్యం వెనక
నిజం నుండి జన తేజం!
రాత్రి వేళ సూర్యునిలా.
మనిషి మనిషి విలువను పైకెత్తే
ఆశయ నవకరాలతో.
అనల శిఖకు కొత్త చరిత నిస్తూంది,
బీజ ఫలంలో సమన్యాయంతో.
వర్తమానం నా రూపం
నా రూపం వర్తమానం

("అపూర్వ" కావ్యం నుండి)